క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పలకలు, పెన్సిళ్లు అందిస్తున్న ఉపాధ్యాయులు

కలసపాడు : మండలంలోని తెల్లపాడు జెడ్పీహైస్కూల్‌లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 70 మంది విద్యార్థులకు పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ బాలకృష్ణారెడ్డి పలకలు, పెన్సిళ్లు, కాంబాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణారెడ్డికి ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్ వల్లి, ప్రభాకర్‌రెడ్డి, జోజిరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు అందజేత



నోటు పుస్తకాలు, బ్యాగులతో బాలికలు

పోరుమామిళ్ల : పట్టణంలోని ఓఎల్ఎఫ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న 150 మంది బాలికలకు గురువారం చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎఫ్‌సీయస్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా తోమాస్‌రెడ్డి దంపతులు ఉచితంగా నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయం చేసేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ఎఫ్‌సీఎస్ ఉచితంగా అందచేస్తున్నదన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఇందిర

ప్రొద్దుటూరు : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర తెలిపారు. మండలంలోని గోపవరం పాఠశాలలో గురువారం ప్రభుత్వ పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిర మాట్లాడుతూ పాఠశాల, మన ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి తీరని హాని కలుగుతోందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సుధారాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రాజుపాళెం ఎంఈఓగా ప్రసాద్



రాజుపాళెం : రాజుపాళెం మండల విద్యాశాఖాధికారి–1గా జి.ప్రసాద్ గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రొద్దుటూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (గరల్స్ హైస్కూల్) నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ముందుగా ఆయనకు ఎంఈఓ–2 రామస్వామి రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మార్సీ అటెండర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నాగభూషణం, పలువురు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ–1గా బాధ్యతలు స్వీకరిస్తున్న మహమ్మద్ షఫీ

కాశినాయన : మండల ఎంఈఓ–1గా మహమ్మద్ షఫీ గురువారం నరసాపురంలోని ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనకు ఎంఈఓ–2 నిర్మల, ఎమ్మార్సీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో కూలిన చెట్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని వాహనాల పార్కింగ్ స్థలంలో గురువారం మధ్యాహ్నం ఓ చెట్టు నేల కూలింది. ఎలాంటి గాలి, వాన లేకున్నా ఉన్నట్లుండి చెట్టు, కొమ్మలు విరిగి పడడంతో స్థానికులు ఆందోళన చెందారు. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే ప్రమాదం ఉదయం లేదా సాయంత్రం జరిగి ఉంటే నష్టం వాటిల్లేదని, ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లేదని స్థానిక దుకాణదారులు తెలిపారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి
- 3వ వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం



చంద్రబాబు మోసపు హామీలతో ఎంత మేర నష్టపోయారో జాబితాను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజమని, అందుకే ఆయనను మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని అంటారని వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు గుర్రంపాటి సుందర్‌రామిరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో గల వల్లెరవారిపల్లె గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలను సమావేశపరిచి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాక పోవడంతో ఎంత మేర నష్టపోతుందని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలతోపాటు 143కు పైగా హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. పెన్షన్ల హామీని అమలు చేసినట్లు ప్రకటించినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పెన్షన్లు తొలగించారని, కొత్త పెన్షన్లు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిని రెడ్‌బుక్ పేరుతో వేధించి అక్రమ కేసులు బనాయించడం తప్ప మరేమీ చేయలేదన్నారు. సంపద సృష్టిస్తానని గొప్పలు చెప్పి పథకాలు అమలు చేయకుండానే ఏడాదిలోనే ఏకంగా రూ.1.81 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు తెచ్చిన అప్పు ఎక్కడికి పోయిందో ప్రజలకు తెలపాలని కోరారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని అన్నారు. ఇదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఎంత మేర నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మోసపు హామీలతో ప్రజలు ఎంత మేర నష్టపోయారు అనే జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు జి.కృష్ణారెడ్డి, బూత్ కన్వీనర్లు సుబ్బారెడ్డి, చెంచయ్య, వెంకటసుబ్బయ్య, పి.సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంగయ్య, చిన్న కొండయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, నరసింహులు, నాగరాజ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యావ్యవస్థను కార్పొరేట్, ప్రైవేటు వ్యవస్థలకు అప్పజెప్పే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలోని సభా భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9 రకాల పాఠశాలల వ్యవస్థను తీసుకురానున్నట్లు ప్రభుత్వం జీవో విడుదల చేసి విధి విధానాలు రూపొందించిందని, దీని వలన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. నియోజకవర్గానికి ఓ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగురవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, అజయ్, జిల్లా కమిటీ సభ్యులు మోహన్, సుమంత్, సుశాంక్, లోకేష్, కమిటీ నాయకులు అరవింద్, శివ, మల్లి, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న దివ్యాంగుల ఉపకరణాల కోసం కొలతలు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 5వ తేదీన వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలింకో కంపెనీ సహకారంతో వికలాంగుల ఉపకరణాల పంపిణీ కోసం నిర్వహిస్తున్న క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్లఓబులేసు పేర్కొన్నారు. గురువారం వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ తేదీన ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు నిర్వహించే ఈ క్యాంపులో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు దివ్యాంగుల వద్ద కొలతలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకోసం అర్హులైన ప్రతి దివ్యాంగుడు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రఫీ, పట్టణ అధ్యక్షుడు బాలరాజు, ఏరియా అధ్యక్షుడు మురళి, మహిళా అధ్యక్షురాలు నాగమణి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రేపు ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్

బద్వేలు అర్బన్ : విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఆగస్టు 2వ తేదీ శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదనవిజయకుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక హైస్కూలు ఆవరణలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఫ్యాప్టో బద్వేలు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పెద్దలు విద్యారంగంపై పలు ప్రయోగాలను చేస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలో అసంబద్ధాలను తొలగించాల్సింది పోయి మండల విద్యాశాఖాధికారి–1 పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులకు కట్టబెట్టడం తగదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంజిపెంచలయ్య, టి.శివప్రసాద్, కె.సుధాకర్, ఎం.సుబ్బరాయుడు, ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, పి.చంద్రశేఖర్ యాదవ్, ఎస్.మస్తాన్‌వలి, ఎన్.పవన్‌కుమార్, ఎస్.బాలయ్య, ఆర్.రాజా, కొండయ్య, ఎ.లాజరయ్య, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఓబులేసు, పుష్పావతిల వివాహానికి గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సుదర్శన్, పుత్తా రాజశేఖర్‌రెడ్డి, కడప రమణారెడ్డి, జయన్న, జె.సింగరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ భవన నిర్మాణానికి సహకరించండి

మైదుకూరు : మైదుకూరులో ఎన్జీఓ భవన నిర్మాణానికి సహకరించాలని ఏపీ ఎన్జీఓ మైదుకూరు తాలూకా సంఘం నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కోరారు. సంఘం అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మాచనూరు రాఘవయ్య తదితరులు గురువారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైదుకూరులో ఎన్జీఓ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా కృషి చేయాలని, భవన నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. ఆ మేరకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సానుకూలంగా స్పందించారని ఎన్జీఓ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో లక్కినేని బాబు, రాజన్న, పెంచల్‌రెడ్డి, గురుప్రసాద్, మేరి సువర్ణ, రామగుప్త పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదు

జమ్మలమడుగు : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో విద్యుత్ పోరాటం తప్పదని, వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ నాయకుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల విడుదల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రజలు,వామపక్షాలు వ్యతిరేకించాయన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు పగల కొట్టాలని పిలుపు ఇచ్చారని, మరి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారో లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి ట్రూ అప్, ఇంధన చార్జీల పేరుతో వేలకోట్లు వసూలు చేసిందని, స్మార్ట్ మీటర్లు కూడా పెడితే ప్రజల మెడకు ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. భవిష్యత్‌లో విద్యుత్ రంగం మొత్తం అదానీ చేతికి వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దండు రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న నూతన కమిటీల సభ్యులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలు కమిటీలకు సభ్యులను నియమించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చెన్నమరాజుపల్లె గ్రామ పంచాయతీకి చెందిన బాగ్దాద్ షరీఫ్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, మండల బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా నక్కం రవిశంకర్‌ను, మండల పార్టీ సెక్రటరీగా నక్కం భాస్కర్‌ను, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శాంతి లక్ష్మి, మహిళా విభాగం కమిటీ సెక్రటరీగా ఒంగలి ఓబులమ్మను, సోషల్ మీడియా వింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మేడం అజరయ్యను నియమించారు. వీరు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి పూలమాల, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కం వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, నారాయణ, గంగయ్య, వెంకటపతి, జయరాముడు, ఏసుదాసు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పై వివక్షతో నెల రోజులు అయినా జీతాలు చెల్లించకపోవడం తగదని, వెంటనే వారికి చెల్లించాలని జీతాలు ఈపీఎఫ్ ఈఎస్ఐఎల్ తో సహా చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా వేధిస్తున్నాయని, ఈఎంఐలు చెల్లించలేక, రోజువారి కార్యకలాపాలు కొనసాగలేక తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్/ కడప కోటిరెడ్డి సర్కిల్ : సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తమ సిబ్బందితో కలిసి గురువారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలనగృహం సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పరిసరాలను, జీవన పరిస్థితులను, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్ వైద్యాధికారిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయిలో విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో లీగల్ లిటరసీ క్లబ్ వారు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ లిటరసీ క్లబ్‌లో ఉన్న న్యాయ సంబంధిత పుస్తకాలు, కంప్యూటర్‌ను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఎన్‌డీపీఎస్ చట్టం గురించి వివరించారు.

కూటమి పాలనలో పడకేసిన ప్రగతి



గానుగపెంటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి గానుగపెంట, వెంకట్రామాపురం పంచాయతీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడన్నారు. గతంలో జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నవరత్నాల కార్యక్రమం ద్వారా నెరవేర్చారని ప్రజలకు గుర్తు చేశారు. కూటమి పాలనలో నిత్యావసర వస్తువుల పెరిగాయన్నారు. అందుకే బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అని ప్రజలకు చెప్పేందుకే ఇంటింటికి వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు వెంగళరెడ్డి, గానుగపెంట, వెంకట్రామాపురం సర్పంచులు చిన్న వీరభద్రుడు, బాలయ్య, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య, డాక్టర్ బాష, చిన్న గురయ్య, వెంకటసుబ్బయ్య, లక్కినేని ఓబయ్య, సంటెయ్య, నారాయణ, రమణయ్య పాల్గొన్నారు.

హామీలు సరే అమలెప్పుడు?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : ఎన్నికలకు ముందు హామీలిచ్చారు.. అధికారంలోకి వచ్చినా అమలు చేసేదెప్పుడు అని ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిళ్ల చిన్నసూరారెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ రొండామాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో రెడ్డిపల్లె, రెడ్డిపల్లె బీసీకాలనీ, ఎస్సీకాలనీలలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తూ వచ్చారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ప్రజలకు నెరవేర్చి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రెడ్డిపల్లె సర్పంచ్ నాగం నరసారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, వెంకటేష్‌యాదవ్, రమణయ్యయాదవ్, డీలర్ కృష్ణారెడ్డి, లక్షుమయ్య, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, పెంచల్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలో మద్యం దుకాణమా?



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు : మండలంలోని అన్నవరం జెడ్పీ హైస్కూల్ సమీపంలో నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటుచేయడం తగదని ఉపాధ్యాయులు, విద్యార్థులు అన్నారు. చాపాడు మండలానికి మంజూరైన రెండు మద్యం దుకాణాల్లో ఒకటి చాపాడులో ఏర్పాటు చేశారు. రెండో దుకాణాన్ని నిర్వాహకులు అన్నవరంలో ఏర్పాటు చేశారు. అయితే పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడంతో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు. ఆయన స్పందించి పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్ సేవలు మరువలేనివి

రాజుపాళెం : మండల తహసీల్దార్‌గా చేసిన సేవలు మరువలేనివని ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఇక్బాల్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ దంపతులను ఏఓతో పాటు డిప్యూటీ తహసీల్దార్ మనోహర రెడ్డి, ఏఓ శివరామ కృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ శేఖర్, ఎంఈఓ–2 రామస్వామి రెడ్డి, ఆర్ఐ హుసేన్ రెడ్డి, వీఆర్ఓలు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఏలు శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని వెలవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కె.హాజీ రహంతుల్ల పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యా రంగంలో ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆయనకు ఎంఈఓ–2 రామస్వామి రెడ్డి, పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, సర్పంచ్ మహబూబ్ బాష, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.జాకీర్ హుసేన్, జామియా అంజుమన్ కమిటీ మహబూబ్ షరీఫ్, పద్మనాభ రెడ్డి, మౌలాలి ఆయా పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయులు సత్కరించారు. రాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు రషీద్ ఖాన్ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

5న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన

కడప కోటిరెడ్డి సర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని, స్మార్ట్ మీటర్ల దారిదోపిడి విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈనెల 5వ తేదీన విద్యుత్ భవన్ వద్ద ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టనున్నాయని రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబాషలు తెలిపారు. గురువారం కడప రైల్వే స్టేషన్ ఆవరణలో గూడ్స్ షెడ్ యూనియన్ కార్యాలయంలో ఆందోళనలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్‌బాషా

పోరుమామిళ్ల : బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై పట్టణంలో 3 వ ఎంపీటీసీ ఇస్సాక్ ఆధ్వర్యంలో గురువారం వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీయం బాష, సర్పంచ్ రవి ప్రకాష్‌రెడ్డి, పార్టీ వివిధ విభాగాల జిల్లా నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజీవ్‌బాష, రాళ్లపల్లె నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ప్రజలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందన్నారు. పాలకులు అభివృద్ధి, సంక్షేమం మరిచిపోయారన్నారు. బాబు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు.

దాతల సహకారం మరువలేనిది



వెలవలి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నగదును అందిస్తున్న దాత సాంబశివా రెడ్డి

రాజుపాళెం : దాతల సహకారం మరువలేనిదని హెచ్ఎం ఉమాదేవి పేర్కొన్నారు. మండలంలోని వెలవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో జరిగిన పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన సానియా, హుసేన్ వల్లి విద్యార్థులకు దాత ముదిరెడ్డి సాంబశివారెడ్డి రూ.30 వేలు చొప్పున ఇద్దరికి రూ.60 వేలను గురువారం అందించారు. అలాగే ఎమ్మార్సీ అటెండర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నాగభూషణం పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మిద్దెల అల్ అల్ఫా రూ.2500, ఉప్పలపాటి భారతి రూ.1500, షేక్ ఆఫ్రిన్ రూ.1000లు అందించారు. వారిని హెచ్ఎంతో పాటు సర్పంచ్ మహబూబ్ బాష, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కె.జాకీర్ హుసేన్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మహావతార్ నరసింహ సినిమాను వీక్షించాలి



ర్యాలీగా మహావతార్ నరసింహ సినిమాకు వెళుతున్న ఇస్కాన్ బృందం

ప్రొద్దుటూరు కల్చరల్ : మహావతార్ నరసింహ సినిమాను ప్రతి ఒక్కరూ వీక్షించాలని ఇస్కాన్ బృందం తెలిపింది. గురువారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ కేంద్రం నుండి మహావతార్ నరసింహ సినిమాకు దాదాపు 450 మంది ఇస్కాన్ బృందం నగర సంకీర్తన, భజనలు చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ తరలివెళ్లారు. మైదుకూరు రోడ్డులోని ఆరవేటి థియేటర్‌కు చేరుకుని సినిమాను ఆసక్తిగా తిలకించారు. పురాణ గాథ కలిగిన ఈ సినిమాను ప్రతి ఒక్కరూ కుటుంబంతో వీక్షించి, నేటి తరానికి మన గాథను తెలపాలని వారు వివరించారు. నైతిక విలువలు, భక్తిని భావితరాలకు అందించే ఉద్దేశంతో తీసిన ఈ సినిమా భావితరాలకు ప్రయోజనకరమన్నారు.